# అంతుపట్టని బిజెపి వ్యూహం?

-ఎంఐఎంతో సై అంటే సై
-రసవత్తరకంగా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నిక
-ఇతర పార్టీ కార్పొరేటర్లతో బిజెపి అంతర్గతంగా చర్చలు
-జాతీయ వాదం ప్రస్తావన..పొలిటికల్ కేరీర్‌కు భరోసా
-తర్జన భర్జనలో పలువురు బిఆర్ఎస్-కాంగ్రెస్ కార్పొరేటర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**
హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరుగుతుండటంతో అందరి చూపు ఇప్పుడే గ్రేటర్‌పై నెలకొంది. బలాబలాల్లో మజ్లిస్‌కు మొగ్గ ఉన్నా.. వార్ వన్ సైడ్ కాదంటోంది భారతీయ జనతా పార్టీ... ఎంఐఎం వర్సెస్ బీజేపీ పోరులో ఫలితం ఎలా ఉండబోతోంది? గాలిపటాన్ని అడ్డుకునేందుకు కమలం ముందున్న దారేది? అన్నది రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీక కొన్ని పర్యాయాల నుంచి ఏకగ్రీవం అవుతూ వస్తుంది. కానీ ఇప్పుడలా కుదరదంటూ బరిలోకి దిగింది బిజెపి. పాతబస్తీపై పట్టున్న ఎంఐఎంకు వ్యతిరేకంగా బిజెపి నిలబడింది. దాదారు కొన్ని ఏళ్ల తర్వాత ఏప్రిల్ 23న (బుధవారం) ఎన్నికలు జరుగుతున్నాయి.లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో బలాబలాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబట్టలేదు. మెజారిటీ సభ్యులు ఉన్న ఎంఐఎం అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అనుకున్న తరుణంలో బీజేపీ బరిలో నిలబడటంతో ఓటింగ్ అనివార్యమైంది. ఎంఐఎం తరపున మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బిజెపి తరపున గౌతమ్ రావు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

**మొత్తం 112 ఓట్లు..**
ఈస్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 112 ఓట్లు ఉండగా.. అందులో 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మజ్లిస్ పార్టీకి 40 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో 49 ఓట్ల బలం ఉంది. బీజేపీకి 19 మంది కార్పొరేటర్లు 6 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 25 మంది, బిఆర్ఎస్‌కు 15+9 కలిపి 24, కాంగ్రెస్ 7+7తో 14 సభ్యుల సంఖ్యాబలం ఉన్నాయి. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎంఐఎంకు మద్ధతు తెలుపుతుందని ఆపార్టీ ఆశాభావంతో ఉంది.

**సంఖ్యాబలం లేకున్నా...**
గెలుపు కోసం కావాల్సిన సరైన సంఖ్యాబలం లేకున్నా.. బల్దియాపై పట్టు బిగించేందు కాషాయ నేతలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు జట్టుగా ఎంఐఎంకు సహకరిస్తున్నాయని ప్రజల ముందు ప్రూవ్ చేయడం తమ లక్ష్యమని బిజెపి నేతలు చెబుతున్నారు. అలాగే హైదరాబాద్‌లో ఎంఐఎం ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు బీజేపీ గెలుపును కోరుకుంటున్నారని, అందుకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా తమకు ఓటేస్తారని బీజేపీ అభ్యర్థి గౌతం రావు అంటున్నారు. జాతీయ వాదానికి, జాతి విద్రోహులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా ఆయా పార్టీలను కాదని కార్పొరేటర్లు తనకు ఓటేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను కమలం పెద్దలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇచ్చేలా తమకు ఉన్న 25 ఓట్ల కంటే అదనంగా ఓట్లు సాధిస్తామని అంటున్నారు. ఇప్పటికే ఇతర పార్టీల కార్పొరేటర్లతో మాట్లాడేందుకు పలువురు బిజెపి ఎంపిలకు అధిష్టానం బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలుస్తుంది. ఒకవేళ బీజేపీ పార్టీలోకి వస్తామన్న కార్పొరేటర్లకు పొలిటికల్ కేరీర్ గ్యారంటీ కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీంతో చివరి క్షణం వరకు బీజేపీ ప్లాన్ ఎంతమేరకు వర్క్ అవుట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలిపటం విజయబావుట ఎగురవేస్తుందా.. లేక నిజంగానే ఏదైనా అద్భుతం జరిగి కమలం వికసిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.



# హైదరాబాద్ వార్త

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ..ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ట్యాక్స్ సెక్షన్ 9, శానిటేషన్ 6, ఇంజనీరింగ్ విభాగం 5, అడ్మినిస్ట్రేషన్, హెల్త్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్ విభాగాలకు 3 చొప్పున, ప్రాజెక్ట్స్, యు.బి.డి, లేక్స్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్, ఎలక్షన్స్, యు.సి.డి విభాగాలకు రెండు చొప్పున, అడ్వర్టైజ్మెంట్, విజిలెన్స్, సిపిఆర్ఓ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు, ఫోన్ ఇన్ ద్వారా ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరిరావు, అడిషనల్ సిసిపిలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

# రేపే ఎమ్మెల్సీ ఎన్నిక

-జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పోలింగ్‌కు ఏర్పాట్లు
-112మంది ఓటర్లు..రెండు పోలింగ్ బూత్‌లు
-ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు ఓటింగ్
-25న కౌంటింగ్ ... అదేరోజు ఫలితం వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**
జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో కలిపి మొత్తం 112 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈనేపథ్యంలో బుధవారం జరగబోయే ఎన్నికలకు సంబంధించిన జిహెచ్ఎంసి ముమ్మురమైన ఏర్పాటు చేస్తుంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లందరికీ ఒకటి నుంచి 112 వరకు వరుస సంఖ్యలను కేటాయించి, పోలింగ్ బూత్ నెం.1లో ఓటరు క్రమ సంఖ్య నెంబర్ 1 నుంచి 56 వరకు, అలాగే ఓటరు వరుస సంఖ్య నెంబర్ 57 నుంచి 112 వరకు పోలింగ్ బూత్2 లో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అనురాగ్ జయంతి ఇప్పటికే ఎలక్షన్ స్టాఫ్ కు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని కూడా ముగించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బిల్డింగ్ మెయింటెనెన్స్ రూమ్‌లో పోలింగ్ స్టేషన్1, లైబ్రరీ రూమ్‌లో పోలింగ్ స్టేషన్2ను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి పోలింగ్ బూత్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులు, రెండో పోలింగ్ కేంద్రంలో కార్పొరేటర్లు ఓటింగ్‌ను వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించనున్న ఈ ఎన్నికకు సంబంధించి ఈ రెండు పోలింగ్ బూత్ లలోనే బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ ముగిసిన తర్వాత ఫస్ట్ ఫ్లోర్ లోని పన్వర్ హాల్ లో భద్రపరిచి ఆ తర్వాత 25వ తేదీన ఆదే హాల్లోనే ట్లను లెక్కించి, ఫలితాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.కాగా బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు పోలింగ్ జరగనుంది. అలాగే 25న శుక్రవారం ఉదయం 8ంగలకు కౌంటింగ్ ప్రారంభించి అనంతరం ఫలితాలు వెల్లడించనున్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలు భేష్ : కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

**హైదరాబాద్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యులను, సిబ్బందిని అభినందించారు. సోమవారం దోమలగూడ గగన్ మహల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు రోగులకు త్రాగునీరు తగినన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. లేబరేటరీని సందర్శించి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ప్రసవగది, ఐపి వార్డును, స్కానింగ్ రూమ్‌ను పరిశీలించి అనవసరంగా ఉన్న వస్తువులను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో తగినన్ని మందులు ఉన్నాయా ఏమైనా షార్ట్ ఫాల్ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయని, ఇలానే కొనసాగించాలని అన్నారు. ఆసుపత్రి కావలసిన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారిని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయమాలిని, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ రాజ్యలక్ష్మి, తహసిల్దార్ సంధ్య రాణి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్యం కోసం వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

## ఇంట్లో చొరబడ్డ దొంగల ముఠా

-దంపతులను కత్తులతో బెదిరించి బంగారం,వెండి దోపిడి

**అత్తాపూర్ ఏప్రిల్ 21,ప్రభాతవార్త :**
రోజు రోజుకు రాజేంద్రనగర్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు.సోమవారం బద్లగూడ జాగిర్ కార్పొరేషన్ పరిధిలోని పిటి కాలనీలో ఓ ఇంట్లో దొంగల ముఠా చొరబడి కత్తులతో బెదిరించి దొచుకొని పారిపోయారు.వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎసిపి శ్రీనివాస్,సిఐ క్యాస్ట్రో తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.ఎసిపి శ్రీనివాస్ వివరాల ప్రకారం...షిఫ్ట్ డిజైర్ కారులో వచ్చిన నలుగురు దొంగల ముఠా బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని పిటి కాలనీలోని ఓ ఇంట్లోకి చొరబడ్డి ఇంట్లో ఉన్న దంపతులను కత్తులతో బెదిరించి 6 తులాల బంగారం,వెండితో పాటు 20వేల నగదు,రెండు సెల్ ఫోన్లను దొచుకెళ్లినట్లు తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సిసి టివి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య..

**కొంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
భార్యాభర్తల మధ్యన వచ్చిన విభేదాలతో తీవ్ర మనస్తాపం చెందిన భర్త చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా హత్నూర గ్రామానికి చెందిన వెంకటేష్ (29) గత కొంతకాలంగా బాచుపల్లి బైరాని చెరువు పక్కన గుడిసెలో ఉంటూ చెత్త సేకరిస్తూ జీవనం గడిపేవాడు. వెంకటేష్‌తో పాటు అతని తల్లి కూడా అతని వద్ద ఉండేది. గత కొన్ని రోజుల నుంచి వెంకటేష్ తన భార్య శ్వేతతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో శ్వేత తన తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. కొన్ని రోజుల క్రితం వెంకటేష్ పై శ్వేత సంగారెడ్డి జిల్లాలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో సోమవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తన గుడిసె సమీపంలోని బైరానీ చెరువులో దూకి తన తల్లి కళ్ళముందే వెంకటేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్ తల్లి ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు డిఆర్ఎఫ్ బృందానికి సమాచారం అందించి వారి సహకారంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకటేష్ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటేష్ కోసం గాలిస్తున్న డిఆర్ఎఫ్ బృందం

## గంజాయి గుట్టురట్టు..

-నలుగురు నిందితులు అరెస్ట్

**హైదరాబాద్,ఏప్రిల్21,ప్రభాతవార్తః**
గుట్టు చప్పుడు కాకుండా గంజాయి మత్తు పదార్థాన్ని విక్రయిస్తున్న నల్గురు నిందితులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.సోమవారం డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం నగరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోఫియాద్దీన్ (24),సయ్యద్ దావూద్ అలీ (26), సయ్యద్ రూమాన్(26). మహ్మద్ ఆయూబ్ (22)లు కలిసి హుమాయన్‌నగర్ పరిధిలో ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు చేపడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక హుమాయన్‌నగర్ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. నల్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 2కేజీల గంజాయి, మూడు మొబైల్ ఫోన్‌లు,ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## స్త్రీలపై అకృత్యాలకు దర్పణం లక్ష్మణరేఖ కూచిపూడి నృత్యరూపకం

- రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన


లక్ష్మణరేఖ కూచిపూచి నృత్యరూపకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :**
అనాదిగా ప్రపంచవ్యాప్తంగా స్త్రీలను అబలలుగా, ఆటబొమ్మల్లా, తక్కువగా చూస్తూ వారిపై జరుగుతున్న అకృత్యాలు, హింసలకు దర్పణంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత్రి ఓల్గా కళ్లకుకట్టి కళ్లుతెరిపించినది ఈ కూచిపూడి నృత్యరూపకం లక్ష్మణరేఖ అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన అల్లంరాజు ఐఎఎస్ అన్నారు. అయితే శక్తిస్వరూపులైన మహిళలు పోరాటపటిమ, ధైర్యసాహసాలతో తమ కలలను ఎలా పండించుకునే ప్రయత్నాన్ని అపూర్వంగా నృత్యీకరించారు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. భాగవతుల సేతురాం తన అద్భుత నృత్యరూపకల్పన కావించి వీక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నారు. ముఖ్యపాత్రల్లో గాంధారిగా డా. యశోద, ఊర్మిళగా రోహిణి, రేణుకగా రమణిలు అభినయ కౌశలంతో కట్టివేశారు. సూత్రధారులుగా, భావ నర్తకులుగా అనిల, శ్రేష్ట, బిందు, త్రివేణి, సృజన, సంధ్యారాణి, క్రాంతికిరణ్, శ్రీనివాస్‌లు వారి పాత్రలకు ప్రాణంపోసి జీవించారు. శ్రీ కూచిపూడి నృత్యనిలయం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భాగవతుల రామకోటయ్య శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవసేన అల్లంరాజు భాగవతుల సేతురాం, లక్ష్మణరేఖ నృత్యరూపకంలోని కళాకారిణులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:**
ఓ మహిళా కానిస్టేబుల్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హస్తినాపురం టీచర్స్ కాలనీలో భర్త, కూతురు, కుమారునితో కలిసి నివసిస్తున్న ఆకుల దీపిక (38) నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నది. అయితే సోమవారం ఆమె ఇంట్లోనే ఉరి వేసుకొని బలవర్మరణానికి పాల్పడింది. కాగా ఇంటికి వచ్చిన దీపిక కూతురు గమనించింది. ఈ మేరకు విషయం తెలుసుకున్న భర్త ఇంటికి చేరుకొని మీర్‌పేట్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా ప్రాంతానికి వచ్చిన పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. దీపిక మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జిహెచ్ఎంసిని సందర్శించిన నాగాలాండ్ సివిల్ సర్వీసెస్ అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి ద్వారా నగరంలో అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజలకు దోహద పడే విధంగా పథకాలు బాగున్నాయని నాగాలాండ్ సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు నాగాలాండ్ సీనియర్ సివిల్ సర్వీసెస్ ఆఫీసర్లకు పబ్లిక్ పాలసీ, ఆన్ గుడ్ గవర్నెన్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ పై శిక్షణలో భాగంగా సోమవారం జిహెచ్ఎంసికి విచ్చేసిన వారికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలు, సంస్థ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాలు, అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, భవన నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ డి), హెల్త్, వెటర్నరీ, ఎంటమాలజీ, ఫుడ్ సేఫ్టీ యాక్టివిటీస్, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఎస్.ఎన్.డి.పి, గతంలో ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టిన పనులు ప్రస్తుతం హెచ్ సిటీ ద్వారా చేపడుతున్న పనులను అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి వివరించారు. అనంతరం నాగాలాండ్ సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ల బృందం క్షేత్ర పరిధిలో పర్యటనలో భాగంగా సాలిడ్ వేస్ట్ నిర్వహణ పై జవహర్‌నగర్ డంపింగ్ యార్డును అధ్యయనం చేయడానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాగాలాండ్ సీనియర్ సివిల్ సర్వీసెస్ వివిధ విభాగాల జాయింట్ సెక్రటరీలు రెనబొమో ఒడియు, విక్విసో చలె, కుస ఫితు, సంగిట్ల జమిర్, అవెలు రుహో, వై చింగ్యక్ కొన్యక్, మొహ్మో తుంగాయ్, అడిషనల్ డిప్యూటీలు కెయిరంగ్ దింగ్ హిగుల్, పి.జమెస్ స్వా, ఎస్.అత్సంగ్లా, డిప్యూటీ సెక్రటరీలివిటోలి సుఖాలు, తదితరులు పాల్గొన్నారు.



నాగాలాండ్ ప్రతినిధలు బృందంతో అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

# మైనర్ల డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

-ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
: అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాలరెడ్డి

**బేగంపేట ఏప్రిల్ 21,ప్రభాతవవార్త**
మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని నార్త్ డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ 1 అదనపు డిప్యూటీ కమీషనర్ సి.వేణుగోపాలరెడ్డి సూచించారు.హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ డీసీపీ ట్రాఫిక్ 1 రాహుల్ హెగ్డే ల ఆదేశాల మేరకు సోమవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ లో రోడ్డు ప్రమాదాలు మరియూ నివారణ అనే అంశంపై నార్త్ డిస్ట్రిక్ట్ 1 ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమీషనర్ వేణుగోపాలరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ముఖ్యంగా మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేసిన వారితో పాటు వారి తల్లి దండ్రుల సమక్షంలో వేణుగోపాల రెడ్డి వారికి పలు సూచనలు చేసారు.ముఖ్యంగా యువత డ్రంకన్ డ్రైవింగ్ చేయడం, మితిమీరిన వేగంతో ప్రయాణించడం,సిగ్నల్స్ జంప్ చేయడం తో పాటు మొబైల్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో వారి విలువైన ప్రాణాలను కూడా కోల్పోతున్నారని ఆయన తెలియజేసారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్నారని,పాదచారుల ప్రాణాలకు ప్రమాదాలు తెచ్చి పెడుతున్నారని అన్నారు.యువత మత్తుకు బానిసలై మత్తులో ప్రయాణిస్తూ వారు ప్రమాదాలకు గురి కావడమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నారని,ఇది తల్లి దండ్రులు గమనించాలని,మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను ఇవ్వవద్దని ఆయన హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న వారిపై,రాంగ్ రూట్లో ప్రయాణించే వారు,డ్రంకన్ డ్రైవ్‌పైన తనిఖీలు చేపడుతున్నామని,అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఆయన హెచ్చరించారు.తల్లి దండ్రులు వారి పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బేగంపేట టీటీఐ ఇన్స్‌పెక్టర్ నాగుల అశోక్ సిబ్బంది,నిబంధనలు అతిక్రమించిన వాహనదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


బేగంపేట టీటీఐలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాలరెడ్డి.

## టిఆర్ఎస్ రజోత్సవ సభకు భారీగా తరలిరండి : సతీష్ రావు



పోస్టర్‌ను ఆవిష్కరించిన సతీష్‌రావు

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఈనెల 27న వరంగల్లో జరిగే టిఆర్ఎస్ రజోత్సవ సభకు భారీగా తరలి రావాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పిలుపునిచ్చారు. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బి.ఆర్.ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంబిపూర్ రాజుల ఆదేశాల మేరకుమహిళా నాయకురాలు ప్రీతి ఆధ్వర్యంలో ఎర్రబెల్లి సతీష్ రావు ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్, చాలిస్ మకాన్‌లలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. చలో వరంగల్ నినాదంతో ఈ నెల 27న తెలంగాణ బాపు కే.సీ.ఆర్ అధ్య క్షతన జరగనున్న బి.ఆర్.ఎస్ పార్టీ రజతోత్సవ సభకి ప్రజలంతా పెద్ద ఎత్తున తరలి రావాలని, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎర్రబెల్లి సతీష్ రావు పిలుపునిచ్చారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



వెస్ట్‌జోన్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి ఫిర్యాదుల వెల్లువ కొనసాగింది. జోనల్ కార్యాలయంతో పాటు శేరిలింగంపల్లి,చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు సర్కిళ్లఓ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాగా మొత్తం 27 వినతులు అధికారులకు అందాయి. ఇందులో భాగంగా జోనల్ కార్యాలయంలో 8,శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 11, యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో 5, చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక,పన్నుల విభాగం, ఇంజనీరింగ్ విభాగాలకు సంబందించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి, యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి,ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులు స్వీకరించారు.

## ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చూడండి: జగదీశ్వర్‌గౌడ్




ప్రజల తాగునీటి కష్టాలపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులతో సమావేశమైన జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**

వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు వాటిల్లకుండా చూడాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్‌లోని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి,కొండాపూర్,లింగంపల్లి, హఫీజ్‌పేట్,మాదాపూర్ డివిజన్ల పరిధిలోని నెలకున్న తాగునీటి సమస్యలపై ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను, అదేవిధంగా మంజీరా పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీపైప్‌లైన్ పనులపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జీఎం,డీజీఎం ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్థేశంలో అధికారులు, అభివృద్ధి,సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు,బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజి సమస్యను పరిష్కరించిన కమిషనర్ శరత్‌చంద్ర

**- కృతజ్ఞతలు తెలిపిన నాయకులు, ప్రజలు**




గంధంగూడలోని కేకే-2 కాలనీ గేటు వద్ద డ్రైనేజి మరమ్మత్తులు చేయిస్తున్న దృశ్యం

**నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ కేకే-2 కాలనీ ప్రధాన గేటు వద్ద కొంత కాలంగా డ్రైనేజి సమస్య ఏర్పడింది. రోడ్డుపైనే డ్రైనేజి నీరు పొంగడం, దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నేత బోగాల శ్రీనివాస్‌లు ఈ డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని బండ్లగూడ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్రను కోరారు. వెంటనే కమీషనర్ స్పందించి కార్పొరేషన్ నుంచి వాహనంను, పారిశుద్య కార్మికులను కేకే-2కు పంపించారు. వారు డ్రైనేజి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సమస్యను తెలిపిన వెంటనే కమీషనర్ శరత్‌చంద్ర పరిష్కరించారని,ఆయనకు కాలనీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతులు తెలుపుతున్నామన్నారు.ప్రజలసమస్యల పట్ల వేగంగా స్పందించే అధికారి కమీషనర్‌గా ఉండడం స్థానిక ప్రజల అదృష్టమన్నారు. అలాగే మంచినీటి సమస్యను కూడా పరిష్క రించాలని జలమండలి అధికారులను కోరుతామని ప్రేమ్ కుమార్, శ్రీనివాస్‌లు వివరించారు.

## 24 నుంచి మే 24వ తేదీ వరకు సంగీతంలో శిక్షణ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో 24వ తేదీ నుంచి మే 24వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులను నిర్వహించబోతున్నట్లు అకాడమి వ్యవస్థాపక డైరెక్టర్ జి.వసుధామూర్తి, వ్యవస్థాపక ప్రిన్సిపాల్ జి.లక్ష్మణమూర్తి వివరించారు. ఇతర వివరాలకు 8374927736 సంప్రదించవచ్చున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నమయ్య కీర్తనలు,రామదాసు కీర్తనలు, భజన్‌లు, మంగళహారతులు, ఇతర ఆధ్యాత్మిక పాటలు, కీబోర్డు, ప్లానో, బేసిక్స్, సాంగన్స్, భజన్‌లలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కాగా మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 617వ అన్నమయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు వివరించారు.

## అమెరికాతో భారత్ అసమాన ఒప్పందాలు ఆపకపోతే పోరాటాలకు సిద్ధం కావాలి

**-వాన్స్ గో బ్యాక్ నిరసన కార్యక్రమంలో యస్ కె యం రాష్ట్ర కన్వీనర్‌ల పిలుపు**
**-దేశవ్యాప్త పిలుపులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన**




దేశవ్యాప్త పిలుపులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వ్యవసాయం పాడి పరిశ్రమ చేపలు పట్టడంలో అమెరికాతో భారత దేశం అసమాన ఒప్పందాలు చేసుకుంటే దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి,కాంతయ్య,జడ సత్యనారాయణ, రవీందర్ గౌడ్ లు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 22,23, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి "సైమన్ గో బ్యాక్" లాగా . వాన్స్ గో బ్యాక్! భారత దేశం అమ్మకానికి లేదు! బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదం ముందు పూర్తిగా లొంగిపోవడాన్ని వ్యతిరేకిస్తూ విస్తృత స్థాయిలో నిరసనలు తెలియ చేయాలని పిలుపు నిస్తునిచ్చారు. ఆస్ట్రేలియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం, నిర్దిష్ట పరిమాణంలో కందులు,శనగపప్పు దిగుమతులపై జీరోడ్యూటీ భారతదేశం ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేసిందని, అమెరికన్ రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ, మన దేశం తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అంటే అసమానంగా ఉంటుందని అన్నారు. సుంకాలు, మార్కెట్ పరిమితులను ఎత్తివేస్తే భారతదేశానికి అమెరికా పాల ఎగుమతులు భారీగా పెరుగుతాయని ఇది పాడి రైతుల మరణానికి కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ పత్తి రైతులు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ సుంకాలను ఉపసంహరించుకోవడానికి చర్చలు జరపడం చాలా అసహ్యకరమైనది. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఎవరి ప్రయోజనాలను తీరుస్తున్నాయి? రాష్ట్ర ప్రభుత్వాలను లేదా పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోకుండానే అన్ని చర్చలు జరుగుతున్నాయని, ఇటువంటి ఒప్పందాలు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాల అమలుకు హామీ ఇవ్వవు అని, చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా దృఢంగా ప్రతిఘటించి, తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి నిలబడినప్పటికీ, భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను వదులుకోవాలని కోరుతుందన్నారు. ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ ప్రతినిధి బృందం ఏప్రిల్ 21 నుండి 4 రోజులు భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు కూరపాటి రమేష్, శ్రీకాంత్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నెల బాలకృష్ణ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాగిరి ఆంజనేయులు ఆంజనేయులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ స్వాతంత్ర్యం సంగ్రామంలో కాంగ్రెస్ పోరాటాలు అమోఘం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



వట్టినాగులపల్లిలో జైబాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** దేశ స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటాలు అమోఘమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలం వట్టినాగులపల్లి, బండ్లగూడ, నెక్‌నాంపూర్ గ్రామాలలో "జైబాపు జైభీమ్ జై సంవిధాన్ అభియాన్" కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నాడు దేశ స్వాతంత్ర్యం కోసమైనా నేడు తెలంగాణ సాధన కోసమైన కాంగ్రెస్ ముందుండి పోరాడిందన్నారు. కేంద్రంలో బిజెపి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సీఏం రేవంత్‌రెడ్డి తెలంగాణను అన్ని రంగాలలో అగ్రభాగానికి చేరుస్తున్నారన్నారు. రైతులు, వృద్ధులు, నిరుద్యోగులు, మహిళలు ఇలా అన్ని రంగాల ప్రజలు కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ది పనులతో సంతోషం దుతున్నారన్నారు. గత సర్కారు చేసిన తప్పిదాలను పూడుస్తూ, అభివృద్దిలో రాష్ట్రం దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, బండ్లగూడ కార్పొరేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు నవీన్, నరేష్, సురేష్‌గౌడ్, నెక్‌నాంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు జితేందర్, నాయకులు శ్రీరాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మానవాళి దివ్య ఔషధం కళలు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :**

మానవాళికి శాస్త్రీయ, సంప్రదాయ, జానపద, లలితకళలు దివ్య ఔషధం వంటివని వక్తలు అన్నారు. కళలను అభ్యసిస్తూ కాపాడుకొంటూ ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో పంచమవేద నాట్యనిలయం ఆధ్వర్యంలో సంస్థ 23వ వార్షికోత్సవ వేడుకలు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. సంస్థ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్, నాట్యగురువు ఆర్.కనకదుర్గ నేతృత్వంలో సంస్థ శిష్యులు పలు అంశాలతో కావించిన సాంస్కృతిక నృత్యవిన్యాసాలు హోరెత్తించాయి. ముందుగా అంబాపరాకు దేవిపరాకు అంశంతో నృత్యప్రదర్శనలు ప్రారంభించి ఝెంఝెం తనాన; రంగపూజ; బ్రహ్మాంజలి; శివపంచాక్షరి; నమఃశివాయతే; ఇదిగో భద్రాద్రి; మేలుకొనవే శ్రీలక్ష్మి; సంచారదాదర; రుక్మిణీ ప్రవేశం; ధనశ్రీ థిల్లానా; పరమ పురుషుడు; ఎందరికో అభయమ్ము ఇచ్చుచేయి; భామాకలాపం; జగదపుచనవుల జాతర; బాలగోపాల తరంగం; ముద్దుగారే యశోద; అర్ధనారీశ్వరం చివరిగా మంగళం అంశాలను శృతిలయబద్ధం హావభావాలను ప్రదర్శిస్తూ వీక్షకులను ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసి మంత్రముగ్దులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత కూచిపూడి విద్వాంసుడు గురు వేదాంతం రాధేశ్యాం, గౌరవ అతిథులు డా. ఆర్.ప్రసన్నరాణి, లంక లక్ష్మీనారాయణ, డి.మంజులరాణి తదితరులు పాల్గొని పంచమవేద నాట్యనిలయం గత 23ఏళ్లుగా గురు ఆర్.కనకదుర్గ శిక్షణలో ఎంతోమంది గొప్ప నా ట్యకళాకారులుగా తీర్చిదిద్దుతూ చేస్తున్న కళాసేవను కొనియాడారు. చివరిగా నేటి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.




నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులతో రాధేశ్యాం, ప్రసన్నరాణి, లక్ష్మీనారాయణ, కనకదుర్గ తదితర అతిథులు

## అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ అధికారులకు వినతి

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో గత కొంతకాలంగా అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ సోమవారం కూకట్పల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో అదేవిధంగా కూకట్పల్లి సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అధికారులకు వినతి అందిస్తూ విజ్ఞప్తి చేశారు. పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నిత్యం లక్షల లీటర్లను తోడేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బస్తీలో నీటి ఎద్దడి తలెత్తడంతో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులందరూ ఏకతాటిపైకి వచ్చి వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ గతంలో నిరసనలు సైతం చేపట్టారని గుర్తు చేశారు. ప్లాంట్ల నిర్వాహకులకు కనీసం కనువిప్పు సైతం కాకపోవడంతో సోమవారం వివిధ విభాగాల అధికారులకు పెద్ద ఎత్తున బస్తివాసులందరూ తరలి వెళ్లి చంద్రారెడ్డి సమక్షంలో వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ వినతి పత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులు సంక్షేమ సంఘం ఆలయ కమిటీ సంఘం ఇతర నేతలు బస్తి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఊట్ల చంద్రారెడ్డి

## ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం..నిందితుడు అరెస్ట్

**హైదరాబాద్,ఏప్రిల్21, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ మోసాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. అమాయకులే టార్గెట్‌గా లాభాల ఆశ చూపి అందినకాడికి దోచుకుంటున్నారు సైబర్ నేరస్తులు. తాజాగా ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ మోసం కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతీక్‌శుక్ల (23) మరో రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోని వ్యాపారం సాగిస్తున్నాడు. ఓ బ్యాంక్ ఖాతాదా రుడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు గ్రూపులను ఏర్పాటు చేసి మూడు నకిలీ ఆన్‌లైన్ ట్రేడ్ స్టాక్ కంపెనీల అయిన 5పైసా క్యాపిటల్ లిమిటెడ్, బార్‌క్లెస్ సంస్థ, షాండా క్యాపిటల్‌ల లింక్‌లను పంపి ఎర వేస్తాడు. ఇందులో ఉన్న ముఠా సభ్యులు పెట్టుబడికి డబ్బులు వచ్చాయని నమ్మబలికి ఖాతాదా రులను రెచ్చగొడుతారు. ఇలా అమాయకుల వద్ద నుంచి లక్షల రూపాయలు దోచుకుని తప్పించుకోవడం ముఠా పని. అయితే హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు కూడా మాటలకు తలొగ్గి పలు దఫాలుగా రూ.52,29,500లు నింది తుల ముఠాకు ఆన్‌లైన్‌లో బదిలీ చేశాడు. పలుమార్లు వారి వద్ద నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గుర్తించి సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు బృందం దర్యాప్తు చేపట్టగా ప్రతీక్ శుక్లా అనే నిందితుడు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, నాలుగు చెక్‌బుక్స్, కంపెనీల స్టాంపులు స్వాధీ నం చేసుకున్నారు.

## జిల్లా జడ్జికి సత్కారం




**చిక్కడపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘు రామ్‌రెడ్డి, ఎం.మధుసూ దన్ ఆధ్వర్యంలో లేబర్ కోర్టు ప్రిసై డింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జివిఎన్ భరత లక్ష్మి నిజామాబాద్ కు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా బదిలీ అయిన సందర్భంగా సోమవారం అభినందన సత్కార కార్యక్రమం జరిగింది.

# కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేసిన పోలీసులు




ఓ.యూ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

**తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్‌ను సోమవారం అక్రమ అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో బడ్జెట్ మరియు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజ్ చేయాలనీ గత సంవత్సర కాలం పాటు ప్రభుత్వం పై వివిధ రూపాలలో నిరసనలు తెలుపుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అనేక దపాలుగా ప్రభుత్వాన్కి విన్నవించుకుంటున్న యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ సమస్యని పరిష్కరించకుండా కొంతమంది అధికారులు ప్రభుత్వాన్ని తప్పు దోవపట్టిస్తూ ప్రభుత్వాన్ని బదునాం చేసే ప్రయత్నం చేస్తున్నారని అధ్యాపకులు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికి సమస్య పరిష్కరించకపోవడంతో రాష్ట్ర కోర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు అన్ని విశ్వవిద్యాలయాలలో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన కారణంగా 11 యూనివర్సిటీ లలో టెంట్ వేసి ధర్నాచేస్తున్నారు. కానీ ఉస్మానియా యూనివర్సిటీ లో కనీసం టెంట్ వేసుకోవడానికి పర్మిషన్ ఇవ్వకుండా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు నేలపై కూర్చుని టెంట్ లేకుండా ప్రజాస్వామ్యయుతంగా ధర్నా చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ ని ఉస్మానియా యూనివర్సిటీ వీసీ అక్రంగా అరెస్ట్ చేయించి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో నిర్బందించారని ఆరోపించారు. యూనివర్సిటీ టీచర్స్ పై పోలీస్ లతో ఉక్కుపాదం మోపాలని యూనివర్సిటీ వీసీ ప్రయత్నిస్తున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన లో అన్యాయం జరిగినప్పుడు ఉద్యమాలు చేసుకోవచ్చని గత ప్రభుత్వం గడీల పాలన కొనసాగించారని ఇప్పటి ప్రభుత్వం ప్రజాస్వామిక పాలనలో నడుస్తుందని చెప్పుతుంటే యూనివర్సిటీ లలో మాత్రం ప్రభుత్వల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని వీసిపై పండిపడుతున్నారు. పోలీస్‌లతో నిర్బంధాలను పెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ తో చర్చించి వారి న్యాయమయినా డిమాండ్ రెగ్యులరైజేషన్ ని తక్షణమే పరిష్కరించాలని కోరుకుంటున్నామని తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ పరుశరామ్, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ పాండయ్య, డాక్టర్ కవిత, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సనత్, డాక్టర్ కృష్ణవేణితో పాటు పలువురు ఉన్నారు.

## విఎన్ఆర్ విజెఐఈటిలో విజ్ఞానజ్యోతి సమారంభకోత్సవం ఎకచో 7.0

**నిజాంపేట్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

ప్రగతినగర్లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఎక్చచో 7.0ఎచ్ పేరిట ఆదివారం ఆంత్రప్రెనార్‌షిప్ ఫెస్ట్ జరిగింది. రెండు రోజుల పాటు సాగిన ఈ వేడుక ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జర్మన్ వర్సిటీ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్ వంగపండు స్థానికంగానూ, ది ఫ్యాక్టర్‌వై వ్యవస్థాపక సిఇఒ ఫిలిప్ ఆస్మస్ స్విట్జర్లాండ్ నుంచి అంతర్జాల వేదికగానూ పాల్గొన్నారు. రాజ్ వంగపండు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులకు జర్మనీలోని పరిశ్రమల్లోనూ విశ్వవిద్యాలయాల్లోనూ లఘుశిక్షణా కార్యక్రమాలు, అభినివేశ కార్యక్రమాలు వంటి వాటిలో స్వయంగా పాల్గొని అనుభవపూర్వకమైన విద్య నేరుగా లభించే అవకాశాలుంటాయని, తద్వారా అభ్యాసం ద్వారా మాత్రమే కాక ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతికత గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుందని వివరించారు. విజ్ఞానజ్యోతి సంస్థ అధ్యక్షులు దగ్గుబాటి సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులు అనుసృజన, నవకల్పన పట్ల అవగాహన, అభినివేశం కల్పించుకుని తమ చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించటానికి సాంకేతికత సహాయంతో మార్గాలను వెదికి కొత్త కొత్త మార్గాలను వెదకాలని, విజ్ఞానజ్యోతి సంస్థల విద్యార్థులకు తగిన సహాయసహకారాలు ఎప్పుడూ అందుతాయని తెలిపారు. నృత్యతరంగ్ శాస్త్రీయనృత్యకూటమి, క్రెసెండో సంగీత కూటమి, క్రియేటివ్ ఆర్ట్స్, సింటిలేట్, విజె థియెట్రో, విజ్ఞానజ్యోతి సాహితీవనం వంటి విద్యార్థి కూటములన్నీ పాలుపంచుకున్నాయని వివరించారు.

## టీఎస్‌యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి ద్వారా చెక్కు పంపిణీ

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం ఎం. బిఎలాహ్ సంస్మరణ సభ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీఎస్యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ మాట్లాడుతూ ఒక్కరి కొరకు అందరం అందరి కొరకు ఒకరం అనే లక్ష్యంతో ఏర్పడిన కుటుంబ సంక్షేమ నిధి టీఎస్యుటిఎఫ్ ఎఫ్‌డబ్ల్యూఎఫ్ ద్వారా ఇప్పటివరకు దాదాపు 38 మంది ఎఫ్‌డబ్ల్యూఎఫ్ సభ్యులు మరణం చందగా వారి కుటుంబ సభ్యులకు ఆరు లక్షలు ప్రతీ కుటుంబం కు ఇచ్చి వారికి అండగా టీఎస్యుటిఎఫ్ సంఘం ఉన్నది అని ఆయన అన్నారు. టీఎస్యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై సాదనకై నిరంతరం పని చేస్తున్నదని, ఉపాధ్యాయుల సంక్షేమంలో భాగంగా సామాజిక స్పృహ కలిగిన సంఘంగా ఎవరైనా ఉపాధ్యాయులు మరణం చెందిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని ఎఫ్‌డబ్ల్యూఎఫ్ నిధి నుండి ఆరు లక్షల రూపాయలు ఇచ్చి సంఘం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వి ఓ టీ టీ ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖాధికారి జమిని కుమారి, జిహెచ్ఎంలు ప్రభాకర్, వెంకట రాములు, టీఎస్యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే జయ సింహ రెడ్డి ప్రధాన కార్యదర్శి మదన్ రెడ్డి, జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, కార్యదర్శులు మహి పాల్ రెడ్డి, కుమారస్వామి, సుధాకర్, అనంతయ్య, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, బాలానగర్ అధ్యక్షులు శ్రీనివాస్, కుకట్ పల్లి అధ్యక్షులు విట్టల్ గౌడ్, మస్తాన్, రత్నం, జైఈస్వర్, శ్రీరాములు, సింహాచలం, సంతోష్, విజయ, వసంత తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి-అల్కాపూర్ కాలనీ రోడ్డును తెరిపించాలి



నార్సింగి-అల్కాపూర్ కాలనీ రోడ్డును తెరిపించాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న గర్వ ప్రతినిధులు.

**నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గండిపేట మండల పరిధిలోని నార్సింగి-అల్కాపురి కాలనీ కనెక్టివ్ రోడ్డును స్థానిక ప్రజల అవసరార్థం తెరిపించాలని కోరుతూ "గర్వ" అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్‌లు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్సింగి రేడియల్ రోడ్డు నుంచి అల్కాపూర్ టౌన్‌షిప్‌కు వెళ్లే రోడ్డును రెండేళ్ల క్రితం ఆర్మీ అధికారులు రాకపోకలు లేకుండా మూసివేశారని, దీంతో అల్కాపూర్ టౌన్‌షిప్‌కు వెళ్లే ప్రజలు 4.కిలోమీటర్ల దూరం చుట్టి రావాల్సి వస్తుందన్నారు. ఈ రోడ్డు మూయడంతో దూరం పెరుగడంతో పాటు సమయం వృధా అవుతుందని పేర్కొన్నారు. ఈ రోడ్డును పునరుద్దరిస్తే అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని వేలాది మంది ప్రజలకు చాలా ఉపయుక్తంగా మారుతుందని, ఈ విషయంపై ఆర్మీ అధికారులతో మాట్లాడి ఒప్పించాలని బండి సంజయ్‌ను కోరినట్లు వివరించారు. మా వినతిపత్రంను చదివిన కేంద్రమంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని, సంబంధిత ఆర్మీ అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారని సురేష్, శ్రీకాంత్‌లు తెలిపారు.

## వీధి దీపాల కోసం డిప్యూటీ కమిషనర్‌ని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**జీడిమెట్ల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

వీధి దీపాలు కోసం గతంలో వెలగడం లేదు అని ఫిర్యాదు చేసిన కొన్ని లైట్లు రిపేర్ చేసి మిగతావి కొత్త లైట్లు లేవని చెప్పడంతో సోమవారం బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఏరియా కమిటీ సభ్యులు గుబ్బల లక్ష్మీనారాయణ ప్రజావాణిలో సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ దృష్టికి తీసుకపోగా, ఆయన డిఇ రఘుపతి రెడ్డితో మాట్లాడారు. ప్రస్తుతానికి లైట్లు లేవు అని చెప్పడంతో గుబ్బల లక్ష్మీనారాయణ గ్రేటర్ హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ నాయుడు ఏఐఎస్ ఆఫీసర్‌తో మాట్లాడడంతో, గత కొంతకాలంగా షార్ట్ సర్క్యూట్ కారణంతో లైట్లు పనిచేయటం లేదని లైట్లు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అనంతరం ఆ ఉన్నతాధికారి అత్యవసరంగా కొన్ని లైట్లు వెయ్యాలని స్థానిక అధికారులను ఆదేశించడం జరిగింది. వెనువెంటనే అత్యవసరంగా కొన్ని లైట్లు వేశారు. రానున్న రెండు మూడు రోజుల్లో మిగతా లైట్లు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి శివకుమార్ నాయుడు, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ, డిఈ రఘుపతి రెడ్డిలకు వారి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన కాలనీ మాజీ ప్రెసిడెంట్ బిఆర్ఎస్ నాయకులు ఆలూరి వెంకట శేషయ్య, పీవీ భాస్కర్ రెడ్డి, శ్యామ్, కాలనీ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పూర్ణచంద్రగుప్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా వస్తాయి

**- బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర**



కిస్మత్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర

**నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా వస్తాయని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాని పరిశీలించారు. లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ తనిఖీలు చేస్తున్నామని, అర్హులని తేలిన వారి జాబితాను ఉన్నతాధికారులకు పంపిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ యం.యాదయ్య, బిల్ కలెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

## రైల్వే సేఫ్టీకి ప్రాధాన్యతనివ్వాలి

**-సిఐటియు జాతీయ అధ్యక్షురాలు హేమలత**




ప్రసంగిస్తున్న సిఐటియు జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత

**చిక్కడపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** దేశంలో ఇటీవల కాలంలో వరుస రైల్వే ప్రమాదాలు సంభవిస్తున్నాయని, లోకో పైలెట్లు, రైల్వే మేనేజర్లు, ట్రాక్ మెయింటెనర్లు, రైల్వే ఉద్యోగుల్లో నియమించబడిన వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు మరియు వందలాది ప్రయాణికులు ఈ ప్రమాదాల్లో మరణిస్తున్నారని దీనికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించడం లేదని సిఐటియు జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత ఘాటుగా విమర్శించారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు కె.చుక్కారాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ రైల్వే సేఫ్టీకి ప్రాధాన్యతనివ్వాలి. ప్రజల ప్రాణాలను కాపాడాలి. ప్రైవేటీకరణ చర్యల ఉపసంహరణకై ఈ ప్రమాదాలకు గురౌతున్న వారిలో ఎక్కువమంది పేద కార్మికులు మరియు రైళ్ళలో జీవనోపాధి కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించే వలస కార్మికులేనని, వరుస ప్రమాదాలు, భారీ ప్రాణనష్టం జరుగుతున్నా కీలకమైన రైల్వే వ్యవస్థను ప్రభుత్వ రంగంలో పటిష్టం చేయకుండా కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో రైళ్ళను సురక్షితంగా నడపడం, ప్రయాణికులను, రైల్వే ఉద్యోగులను ప్రమాదాల నుంచి రక్షించడం వంటి ఆందోళనా పోరాటాల్లో రైల్వే ప్రైవేటీకరణ వ్యతిరేక ప్రచారాన్ని దేశవ్యాప్తంగా సిఐటియు చేపట్టిందని అన్నారు. ఈ క్యాంపెయిన్‌కు ప్రజలు మద్దతునివ్వాలని కోరారు. ఈ పోరా టంలో రైల్వే కార్మికులు, యూనియన్లు, అసోసియేషన్లు తమ అనుబంధాలకు అతీతంగా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

## ఉచిత మెడికల్ క్యాంపులు ప్రారంభించిన జగద్గిరిగుట్ట సిఐ

**జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఎస్‌పిఆర్ చారిటబుల్ ట్రస్ట్, లలిత హాస్పిటల్ వారు సారథ్యంతో సోమవారం మెడికల్ క్యాంపుని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌ను జగద్గిరిగుట్ట సిఐ నరసింహులు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో జరిగిన ఈ మెడికల్ క్యాంప్‌లో స్టాఫ్ అందరూ కూడా హెల్త్ చెకప్ చేయించుకున్నారు. ఈ శిబిరం ఏర్పాట్లును ఎస్‌పిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రషీద్, మహేష్ గౌడ్, మరలింగా, పవన్, వెంకట సాయి, రోహిత్ సాయి, స్వరూప్, మనోజ్, భాస్కర్, వంశీ,శ్రీకాంత్, తేజ పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న సిఐ నరసింహులు

## పేద ప్రజలకు సిఎం సహాయనిధి వరం



సీఎం సయానిది చెక్కును పంపిణీ చేస్తున్న తోటకూర వజ్రేష్ యాదవ్ , రాసాల వెంకటేష్ యాదవ్ , తదితరులు

**బోడుప్పల్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** అనారోగ్యాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిది అని టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.తన నివాసంలో మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ తో కలిసి లబ్ధిదారులైన అంకిరెడ్డి నర్సింహ్మారెడ్డికి రూ.60,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నిరుపేదల అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను చేరవేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ , 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శివ యాదవ్ , చింతల శ్రీనివాస్ రెడ్డి , హరిపాల్ రెడ్డి , మల్లారెడ్డి , గాంధీ , బాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంతి విద్యా నికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వనస్థలిపురం. ఏప్రిల్.21.ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని ప్రశాంతి విద్యా నికేతన్ 199596. పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం హస్తినాపురం లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని గత జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తు చేసుకుని తమ అనుభవాలను పంచుకుని, ఆనందోత్సాహాలతో గడిపారు.ఈ సందర్భంగా ఎవరెవరు ఏ హోదా లో పనిచేస్తున్నది ఒకరినొకరు చెప్పుకుని సంతోషం వ్యక్తం చేసుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి, పార్వతి, లక్ష్మి,సబిత, నాగ భూషణం,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి: డైరెక్టర్ శైలజ



డైరెక్టర్ శైలజకు పుష్పగుచ్చాలను అందజేస్తున్న ట్రాన్స్ జెండర్లు(ట్రాన్స్ జెండర్ ట్రాఫిక్ అసిస్టెంటు

**మలక్ పేట ,ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ట్రాన్స్ జెండర్ ట్రాఫిక్ అసిస్టెంట్లు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారత రాష్ట్ర డైరెక్టర్ బి. శైలజ పేర్కొన్నారు. మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ శాఖ భవనంలో ట్రాన్స్ జెండర్ ట్రాఫిక్ అసిస్టెంట్లు సంస్థ డైరెక్టర్ శైలజను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇష్టపడి ట్రాన్స్ జెండర్లకు గౌరవం ఇవ్వాలని ఉద్దేశంతో ట్రాఫిక్ అసిస్టెంట్లు గా నియమించారని, అధైర్య పడకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. సమస్యలు ఇబ్బందులు ఉంటే కార్యాలయం వచ్చి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అరుణ, సూపరింటెండెంట్ అభివర్మ, ట్రాన్స్ జెండర్స్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రీతి, సునంద, జయంతి, ట్రాన్స్ జెండర్లు సిరా సంతోష్, శివరాం, జస్వంత్, హృదయరాజ్, చరణ్, కూనల్, సంతోష్, శిరీష్, సరళ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులుపై చర్యలు తీసుకోవాలి

- బిజెవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్



మలక్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు అనుముల భరత్ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు అనుముల భరత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మలక్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భారత్ మాట్లాడుతూ ఇడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నాలో ప్రధాని మోడీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు చేసిన వ్యక్తులను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధానిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్, నవీన్ బండారి, జగన్, భార్గవాచారి, నవీన్, ఆశీష్, రేవంత్, రోహన్, సుభాష్, ప్రశాంత్, ఉమేష్ చంద్ర, పటాలియా తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ప్రజావాణికి అపూర్వ స్పందన : డిసి అంజనేయులు



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిసి అంజనేయులు తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు తక్షణమే పరిష్కారం చేస్తున్నామని ఉప్పల్ డిప్యూటి కమిషన్ అంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పలు పిర్యాదులు స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. అనాధికార నిర్మాణాలు నిలిపి వేయాలని పలువురు కాలనీవాసులు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ హరిలాల్, టిపిఒ ముంతాజ్ బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విష్ణుపురి కాలనీలో వరద ముప్పు ..!

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై నివాసితుల ఆవేదన

-కాలనీ వాసులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మద్దతు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి , విష్ణుపురి కాలనీవాసులు

**మేడిపల్లి , ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ విష్ణుపురి కాలనీ వర్షాకాలం రాకముందే వరద ముప్పుకు గురవుతూ, కాలనీ ప్రజలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తోంది. వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజల జీవన విధానాన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. కాలనీ నివాసితులు ఇప్పటికే పలు మార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి ప్రత్యక్ష చర్యలు చేపట్టకపోవడంతో వారు అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, విష్ణుపురి కాలనీ ప్రెసిడెంట్ అమర్నాథ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, మహిళలు, స్థానిక నాయకులు, వివిధ పార్టీలకు సంబందించిన నాయకులు,మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొని సంబంధిత అధికారులకు సమస్యను మరోసారి వివరించారు. ఈ అంశంపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ ... వర్షాకాలానికి ముందే సంబంధిత పనులను పూర్తి చేసి, కాలనీ ప్రజలు మళ్లీ వరద ముప్పుకు గురికాకుండా చూడాలి. అధికారులు బాధ్యతగా స్పందించాలి" అని అన్నారు. ప్రజల కష్టాలను నిర్లక్ష్యం చేయకూడదని, వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఫిర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి , కాలనీ ప్రెసిడెంట్ అమర్నాథ్ , కాలనీవాసులు , పాల్గొన్నారు .

# తార్నాకలో యదేచ్చగా నాలాను ఆక్రమించి నిర్మాణాలు

-మామ్ముాలు తీసుకొని పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు





తార్నాక స్ట్రీట్ నెం. 1లో నాలాపై నిర్మాణం చేపట్టిన దృశ్యం



నాలాపై కప్పు పై గేట్ నిర్మాణం చేసిన స్థానికులు

**తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలాపై ఐదుగురు నిర్మాణాలు చేపట్టి ఏకంగా ఐదేండ్లకు పైగా గడుస్తున్నా సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇది ఎక్కడో కాదు నగర డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహించే తార్నాక డివిజన్‌లో జరిగింది. నాలాలు, చెరువులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చోరవ తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తార్నాక స్ట్రీట్ నెం.ఒకటిలో జీహెచ్ఎంసీ ప్లాన్‌తో సంభందం లేకుండా నాలాలను యదేచ్చగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.ఇందుకు సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు వత్తాసు పలికి వారికి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది కొరత అంటూ తాఖీదులు జారీ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. దీని ఫలితంగా స్థానికులు ఇష్టాను సారంగా నాలాలను ఆక్రమించి వాటిపై నిర్మాణాలు చేస్తున్నారు. దీని ఫలితంగా చిన్న పాటి వర్షం వచ్చిందంటే చాలు ఈ ప్రాంతంలో నాలాలో వర్షపు నీరు ఎక్కువై రోడ్లపై ప్రవహిస్తూ ఇండ్లలోకి వచ్చి చేరుతుంది. ఒ వ్యక్తి ఏకంగా నాలాను ఆక్రమించి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడంటే అధికారులు నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో వ్యక్తి నాలాపై నిర్మాణం చేసి గేటు వేసుకున్నాడు. ఇలాంటి నిర్మాణాలను ప్రాథమిక దిశలో అడ్డుకునే అవకాశం ఉన్నా టౌన్‌ప్లానింగ్ తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కింది స్థాయి మున్సీ పేరుతో ఉన్న సిబ్బంది మామ్ముాలు తీసుకొని ఇలాంటి వారిని వదిలిపెడుతున్నారు. అది కూడా సమాన్యూల విషయంలో ఒకరకంగా పలుకు బడి ఉన్న వారి విషయంలో మరోరకంగా స్పందిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వీరి అక్రమ నిర్మాణాలపై స్థానికులు జోనల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని తాము సీఎంకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు. నాలా పై నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గణేష్ టెంపుల్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ ..భక్తుల ఇక్కట్లు



గణేష్ టెంపుల్ ముందు రోడ్డు ను ఆక్రమించిన పూజా స్టోర్స్ దుకాణాలు.



గణేష్ టెంపుల్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

**వనస్థలిపురం. ఏప్రిల్.21.ప్రభాతవార్త.** వనస్థలిపురంలో ప్రసిద్ధి గాంచిన గణేష్ దేవాలయం ప్రాంగణంలో ఏడు దేవాలయాలు ఉన్నాయి.నిత్యం భక్తులు వందల సంఖ్యలో ఈ ఆలయాలకు వస్తుంటారు.కాగా ఆలయం ముందు ఉన్న పూజా స్టోర్స్‌ల వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో భక్తులు, ఆ దారి గుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ పాలకవర్గం పూజా స్టోర్స్ లకు దుకాణాలు కేటాయించింది. అయితే పూజా స్టోర్స్ నిర్వాహకులు పూజ స్టోర్స్ ముందున్న రోడ్డు ను ఆక్రమించు ఐరన్ గ్రిల్స్ నిర్మించుకుని వ్యాపారం చేస్తున్నారు. దీంతో గుడి ముందు నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ఈ దారి గుండా నిత్యం భక్తులు,వాహనదారులు ,పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా టెంపుల్ వెనుక వైపు బస్టాండ్ ఉన్నది. బస్టాండ్‌ను ఆనుకొని పాలక వర్గం రెండు షట్టర్లు నిర్మించి కిరాయికి ఇవ్వడంతో అక్కడ ప్రధాన రోడ్డు పై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను నిత్యం ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ పాలకవర్గం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రామంతాపూర్‌లో కాంగ్రెస్ నేతల రాజ్యంగ పరిరక్షణ ర్యాలీ





రామంతాపూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారాయన్నారు. అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రామంతాపూర్‌లోని పలు కాలనీల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సుర్వి మురళీగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్, గరిక సుధాకర్, ముత్యాల జంగయ్య, ముత్యాల బాబు, రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, జలీల్‌పాషా, అజ్మత్, శ్యాముల్, సందీప్, సతీష్‌గౌడ్, బాలరాజు, భాస్కర్,ఖాసీంగౌడ్, రాంచందర్, అశోక్,జిల్లు,శ్రీధర్,సతీష్, జంగారెడ్డి,నాగమల్లయ్య, మల్లేష్ యాదవ్, నవీన్, ఇంటూ, రామకృష్ణ, వినయ్, స్వామి, సురేష్, ప్రకాష్, అంబికా, గాయత్రి, శ్రీలత, అనిత పాల్గొన్నారు.

# మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సబితా ఇంద్రారెడ్డి సమీక్ష



కమిషనర్, డిఇలతో సమీక్ష జరిపిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుత వేసవి కాలం నేపథ్యంలో ప్రజలకు తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా కోసం తీసుకోవాల్సిన చర్యలు, రానున్న వర్షాకాలంలో వరద ముంపు, డ్రైనేజీ సమస్యలు కలగకుండా చేపట్టాల్సిన ముందస్తు పనులు అదే విధంగా కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు, సమస్య పరిష్కారం తదితర విషయాలపై సోమవారం మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిఇఇ వెంకన్నతో ప్రత్యేకంగా సమావేశమైన మాజీ మంత్రి ఆయా అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేయడంతో పాటు దిశా నిర్దేశనం చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్పొరేషన్‌లో ఏ ప్రాంతంలో కూడా ప్రజలు తాగు నీటి కోసం అల్లాడే పరిస్థితి రాకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ మేరకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు. అదే విధంగా వచ్చే వర్షాకాలంలో ఎలాంటి వరద ముంపు సమస్యలు గానీ డ్రైనేజీలు బ్లాక్ కావడం వంటి పరిస్థితులు గానీ కలగకుండా ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సబితారెడ్డి వారికి సూచించారు. ఈ మేరకు డ్రైనేజీల్లో పూడికలు తీయించాలనీ, ఓపెన్ కాలువల్లో చేరిన చెత్తా చెదారాన్ని తొలగించాలని ఆమె అన్నారు. వర్షపు నీరు, వరద నీరు లోతట్టు ప్రాంతాల్లో మడుగుల్లా చేరకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఇక పోతే రహదారుల ప్యాచ్ వర్క్‌లు, మరమ్మతు పనులు అవసరమైన ప్రాంతాల్లో చేపట్టి వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న జిల్లెలగూడ చందన చెరువు, మీర్‌పేట్ మంత్రాల చెరువు, పెద్ద చెరువుల్లో గుర్రపు డెక్క ఆకును తొలగించాలనీ ఆయా చెరువుల వద్ద వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆహ్లాదం కోసం, ఆరోగ్యం కోసం జిల్లెలగూడ చందన చెరువు వద్దకు వచ్చే ప్రజల కోసం కొత్తగా టాయిలెట్లు నిర్మించాలని ఆమె ఆదేశించారు. ఇప్పటికే కార్పొరేషన్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్మించినటువంటి మరుగుదొడ్ల నిర్వహణ, మరమ్మతులపై చర్యలు తీసుకొని అవి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని ఆమె కోరారు. ప్రధానంగా ఉదయం వేళలో అదే విధంగా సాయంత్రం పూట ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న బాలాపూర్ చౌరస్తాపై దృష్టి పెట్టాలనీ అక్కడి లేబర్ అడ్డాను, చిరు వ్యాపారులను మంత్రాల చెరువు వద్ద నిర్మించిన స్ట్రీట్ వెండర్స్ షెడ్ వద్దకు తరలించే ఏర్పాట్లు చేయాలని సబితారెడ్డి సూచించారు. మీర్‌పేట్ రైతు బజార్ వద్ద ఉన్న స్ట్రీట్ వెండర్స్ షాపులను వేలం ద్వారా లబ్దిదారులకు కేటాయించాలని ఆమె ఆదేశించారు. కార్పొరేషన్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది విధుల విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా చూడాలని సబితారెడ్డి సూచించారు.

## బధిర విద్యార్థుల సంక్షేమానికి కృషి

- ఫిన్ డైరెక్టర్ జానకి



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న పిన్ సంస్థ డైరెక్టర్ జానకి, సెక్రటరీ బాలకృష్ణ రెడ్డి, బాబు జాన్ తదితరులు

**మలక్ పేట,ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** బదిర విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఫిన్ సంస్థ డైరెక్టర్ జానకి పేర్కొన్నారు. మలక్ పేటలోని ఫిన్ బదిరుల ఆశ్రమ పాఠశాల 18వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు వందన ముఖ్యఅతిథిగా విచ్చేసి సంస్థ డైరెక్టర్ జానకి తదితరులతో కలిసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర విద్యార్థులకు సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. బదిర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు ఇతర అన్ని అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్లోబల్ డాట కంపెనీ సిఎస్‌ఆర్ వింగ్ ప్రసన్న, సంస్థ డైరెక్టర్ జానకి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ రెడ్డి, కోశాధికారి మహమ్మద్ బాబు జాన్, ప్రిన్సిపాల్ సరస్వతి ,మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో తల సేమియా చిన్నారులకు రక్తదానం



**తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్తా :** ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆదివారం సిబిఎన్ ఫాన్స్ అసోసియేషన్ , స్కూల్ ఆఫ్ సిబిఎన్ ఆధ్వర్యంలో,ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ జాతీయ అధ్యక్షుడు తలారి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో " తలసెమియా " చిన్నారులకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 4 సార్లు సీఎం గా,3 సార్లు ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం పార్టీని గత 40 సంవత్సరాలుగా బలోపేతం చేయడంలో ఆయన కృషి, చొరవ, శ్రమ ఎనలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు, అభివృద్ధి లో అయన దూరదృష్టి చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సిబిఎన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలోతలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఉపాధ్యక్షులు రత్నావలి, క్యాంప్ ఇంచార్జ్ వంశీ,పవన్ తో పాటుగావేమూరి నరేష్, మురళీ, నాగరాజు, వినయ్, సతీష్ ,గోపి , వర ప్రసాద్, వినయ్, వికాస్ ,అభిలష్ ,అభిలాష్, కళ్యాణ్, రాజ్ కుమార్, రాము,మహేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## డైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలి : బన్నాల గీత



బ్యాంక్ కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బ్యాంక్‌కాలనీలో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అధికారులతో రూ.70లక్షల వ్యయంతో చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పురాతన పైపులు తొలగించి కొత్త పైపులు వేస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ కాలనీలో పైప్‌లైన్ వేసే ప్రాంతాల్లో బండరాళ్ల రావడంతో పనులు జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, మంచినీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నకుండా పనులు చేపట్టాలని సూచించారు. విరిగిన పైప్‌లైన్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కె.జగన్, ఎం.శ్రీనివాస్, శ్యామ్, కాలనీ నేతలు గపూర్, వెంకటేశంగుప్త, మనోజ్, సందీప్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రారంభం కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీలోని శ్రీహరిహర క్షేత్ర దేవాలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిరోజు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం గణపతిపూజ, గో పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవాలయంలో శ్రీపర్వత వర్ధిని సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి, శ్రీగోదాపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీగణపతిస్వామి, శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీప్రసన్నాంజనేయస్వామి, నవగ్రహాలు, నాగదేవత, వాహన, ధ్వజస్తంభాలకు శ్రీపుష్పగిరి విద్యాశంకరభారతిస్వామి దివ్య ఆశీస్సులతో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

## అభివృద్ధి ప్రజాసంక్షేమ బిజెపి ధ్యేయం :యశ్వంత్‌గౌడ్



స్వతంత్ర సమరయోధుడిని సన్మానిస్తున్న యష్పాల్ గౌడ్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అభివృద్ధి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి పని చేస్తుందని బిజెపి సీనియర్ నాయకుడు బొల్గం యశ్పాల్ గౌడ్ పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం బిజెపి సీనియర్ నాయకులు బొల్గం యష్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వచ్ఛభారత్, జెండా ఆవిష్కరణ, సహపంక్తి భోజనం కార్యక్రమం నిర్వహించారు. భరత్‌నగర్ ఫేస్ 2లోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ దేవాలయం శుభ్రం చేసి కమ్యూనిటీహాల్ వద్ద బిజెపి జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర సమరయోధుడు యాపట్ల బాలస్వామిని శాలువాతో సత్కరించి, మహిళలు, కార్యకర్తలతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చ నాయకురాలు నందికొండ గీతారెడ్డి, బిజెపి స్టేట్ కౌన్సిల్ నెంబర్ కొర్లపల్లి స్వామి, డివిజన్ యువమోర్చా ప్రెసిడెంట్ ప్రసాదం కిరణ్, బూత్ ప్రెసిడెంట్ జంగయ్య, భాస్కర్, రాజేందర్, చెన్నయ్య , శ్రీనివాస్ నరసయ్య, శ్రీనివాస్ గౌడ్, రమేష్, వినోద్, వెంకట్, రాజు, సంప్రిత్, తరుణ్, వరుణ్, విష్ణు, భావన్, శివమణి, పవన్, శ్రీసాయి, చింటూ, శ్రీశైలం, సైదులు, జంగమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ, ప్రేమలత, నరసమ్మ, లక్ష్మీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27న నిర్వహిస్తున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగసభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు.ఆర్కేపురం డివిజన్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో రజతోత్సవ సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర సాదనే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ ఏర్పడిందని, కెసిఆర్ ఒక్కడే గులాబీ జెండా చేతపట్టి ఊరూరు తిరిగి లక్షలాది మంది ప్రజలను సమీకరించి పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయండంలో పూర్తిగా విఫలం అయిందని మళ్లీ రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారని తెలిపారు. 27 న జరిగే బహిరంగ సభకు మహేశ్వరం నియోజవర్గం నుండి సబితమ్మ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామాచారి, సాజిద్, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్,శ్యాంగుప్త, శేఖర్, మహేందర్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, జాహెద్, జగన్, అనురాధ, జయమ్మ, యాదమ్మ, బుజ్జిబాబు, ఇందిరా, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య సమస్యల నివారణకు సమతుల ఆహారం స్వీకరించాలి





సంతులిత పౌష్టిక ఆహారం అంశంపై ప్రసంగిస్తున్న వైద్యాధికారి డా.వి.సౌశీల్య తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జీవ శాస్త్రాల ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.కె.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ పిఒ జె.విశ్వనాధకుమార్, సమన్వయం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌశీల్య పాల్గొని ప్రసంగించారు. మహిళలలో రక్త హీనత, పిల్లలలో పోషక ఆహారం లోపం రాకుండా సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. వయస్సు, లింగం, శ్రమస్థాయి ఆధారంగా మన శరీరానికి అవసరమయ్యే పోషక పదార్థాలను తగు పాళలలో కార్బొహైడ్రేడ్లు, ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు,నీరు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలో ఊబకాయం సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డా.రవిప్రసాద్ మాట్లాడుతూ పాస్ట్‌ఫుడ్ సంస్కృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. రకరకాల పప్పులు,పండ్లు, పాలు, గింజలు, కాయగూరలు, ఆకుకూరలు తగు పాళ్లలో స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది బోగ ప్రకాష్, ఎ.కావేరి, జి.వెంకట్రావ్, కళాశాల అధ్యాపకులు కె.గీత, సత్యనారాయణ, విశ్వనాధకుమార్, డా.ఎస్.యమున, డా.ఎ.శ్రీనివాసరావు, డా.ఆర్.చంద్రసాగర్, డా.వి.చంద్రకళ, డా.పి.వెంకటేశ్వర్లు, జి.మమత, భాగ్యలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రియాశీల సభ్యుల సమావేశం



**తుర్కయంజాల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) :** మున్సిపాలిటీ పరిధిలో బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కార్యాలయంలో క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బోసుపల్లి ప్రతాప్ విచ్చేసి మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించి చెప్పాలని, బిజెపి పార్టీ ఆదేశాల మేరకు రానున్న మూడు రోజుల్లో బస్తి చలో కార్యక్రమాన్నికి ప్రతి ఒక్కరు బస్తీకి వెళ్లి బిజెపి 10 సంవత్సరాల పాలన గురించి మున్సిపాలిటీ ప్రజలకు వివరించాలని తెలిపారు. బిజెపి అధికారంలో రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి , బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ , బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి కొండ్రు పురుషోత్తం, మున్సిపల్ మాజీ అధ్యక్షులు తూళ్ల నరసింహ గౌడ్, బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ సనేం అర్జున్ గౌడ్, కందాల బల్దేవ్ రెడ్డి, నోముల కార్తిక్ గౌడ్, పలుసా శ్రవణ్ గౌడ్, కరాడి అనిల్, కొమ్మిరిశెట్టి బిక్షపతి, సామల యూసుఫ్ రెడ్డి, కొలోన్ రవీందర్ రెడ్డి, మాదుగుల బాల కృష్ణ గౌడ్, నాయిని సంజీవ్ రెడ్డి, నాగరాజు, మల్లెల రమేష్ , విశాల్ గౌడ్, సురేష్ , సాగర్, కొమ్మం శివ తదితరులు పాల్గొన్నారు.